క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సమ్మె నోటీస్ ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు

సూర్యాపేట : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మె నేపథ్యంలో శుక్రవారం సూర్యాపేట సీడీపీఓ కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీస్‌ను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తాటిపాముల నాగలక్ష్మి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంతెనపల్లి సుజాత, శారద, జ్యోతి, సావిత్రి, సునీత, గోవింద్ పద్మ, హుస్సేని పాల్గొన్నారు.

పరిశోధన పర్యవేక్షకుడిగా కోమటిపల్లి వాసి



ఉత్తర్వు కాపీ అందుకుంటున్న సీతారాములు

అర్వపల్లి : రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకుడిగా మండలంలోని కోమటిపల్లి వాసి, కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాసాని సీతారాములు ఎంపికయ్యారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం చేతుల మీదుగా సీతారాములు ఈ నియామక ఉత్తర్వు కాపీని అందుకున్నారు. ఈ సందర్భంగా సీతారాములును గ్రామవాసి, ఐపీఎస్ అధికారి, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, మాజీ సర్పంచ్ జాల నర్సయ్య అభినందించారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



రైస్‌మిల్లు గుమస్తాకు నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెన్‌పహాడ్ : హమాలీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దూపహాడ్ గ్రామంలోని శ్రీరామ్ రైస్ మిల్లు హమాలీ కార్మికులతో కలిసి గుమస్తా సందీప్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెక్కాడితేనే డొక్కాడని హమాలీ కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. హమాలీ కార్మికులకు వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వేలాది మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు రామ్ బాలక్, జితేందర్, రాజు, కృష్ణ, ఉదయ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

తిరుమలగిరి: తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన కారుపోతుల ఉమేష్ అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన అభ్యుదయ యువజన సమాఖ్య యూత్ సభ్యులు శుక్రవారం రూ.25000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రేగుల మహేందర్, రమేష్, కిషన్, దయా యాదవ్, బోడ మహేష్, ఉమేష్, సంతోష్, దిలీప్, సురేష్, మల్లేష్, శ్రీను, కృష్ణ, నాగరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

తుంగతుర్తి : అన్నారం గ్రామ మాజీ సర్పంచ్ పోగుల చిన్న భిక్షం రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అన్నారంలో శుక్రవారం భిక్షం రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దొంగరి శ్రీనివాస్, కుంచాల శ్రీనివాస్ రెడ్డి, అండం వెంకట్ రెడ్డి, మట్టపల్లి వెంకట్, చిత్తలూరి సోమశేఖర్, యాదగిరి, సోమయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- గుంతలమయంగా బొల్లంపల్లి - పర్సాయపల్లి లింకు రోడ్డు
- వర్షాలకు నీళ్లు నిలిచి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీ నిర్మాణం కోసం ఎదురుచూపు



బొల్లంపల్లి - పర్సాయపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



బొల్లంపల్లి గ్రామ శివారులో..

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల హైవేకు సమీపంలో ఉన్నప్పటికీ జాజిరెడ్డిగూడెం మండలంలోని బొల్లంపల్లి గ్రామం ఇప్పటికీ కనీసం ఒక బీటీ రోడ్డు సౌకర్యానికి నోచుకోలేదు. బొల్లంపల్లి నుంచి పర్సాయపల్లి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొల్లంపల్లి గ్రామ ప్రజలు ప్రతి నెలా ఉపాధి హామీ డబ్బులు, పింఛన్ల కోసం పర్సాయపల్లి గ్రామానికి వెళ్లాల్సి ఉంటుంది. అంతేకాకుండా, బొల్లంపల్లి విద్యార్థులు కూడా పర్సాయపల్లిలోని పాఠశాలకు వెళ్తుంటారు. అయితే, ఈ రెండు గ్రామాల మధ్య సరైన రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజల కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారిపై ఉన్న గుంతల్లో పూర్తిగా నీళ్లు నిలిచి ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది.

గతంలోనే బీటీ రోడ్డుకు ప్రతిపాదనలు..

గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీకి మార్చినా, ఇప్పటి వరకు కనీస మరమ్మతులు కూడా జరగకపోవడం ఆశ్చర్యకరం. బొల్లంపల్లి స్టేజీ నుంచి పర్సాయపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం గతంలోనే రూ.3.80 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే, ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఫైల్ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. నిధులు మంజూరైతేనే బీటీ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఈ రోడ్డు వల్ల ఎదురవుతున్న సమస్యలపై బొల్లంపల్లి, పర్సాయపల్లి గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బీటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని, తద్వారా తమ కష్టాలు తీర్చాలని ప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నారు.

అధ్వాన రోడ్డుతో ఇబ్బందులు



మా గ్రామ రోడ్డంతా గుంతలతో అధ్వానంగా మారింది. వర్షాలకు నీళ్లు నిలుస్తున్నాయి. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు అవుతున్నాయి. గతంలోనే మా గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. అధికారులు వెంటనే నిధులు మంజూరుచేయించి బీటీ నిర్మాణం చేపట్టాలి.

– కేసాని రాహుల్, బొల్లంపల్లి

రైతులందరికీ రైతు భరోసా

- ఎమ్మెల్యే మందుల సామేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా అందించిందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నియోజకవర్గ పర్యటన ముగించుకుని వెళ్తూ శుక్రవారం అర్వపల్లిలో ఆగి రైతులతో మాట్లాడుతూ రైతు భరోసా పథకంపై చర్చించారు. ఇంత పెద్ద ఎత్తున రైతు భరోసాను రైతుల ఖాతాల్లో జమచేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ జరగని విధంగా రైతులకు రుణమాఫీ చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, ఏఎంసీ డైరెక్టర్లు సైదులు, జలేందర్, నాయకులు బైరబోయిన మహరాజు, బద్దం యాదగిరి, దల్వాయి శ్రీధర్, దిర్శనపు కృష్ణమూర్తి, ఎ. వెంకటస్వామి, రాంబాబు, కె. మల్లయ్య, శ్రీకాంత్, సురేష్, కేసాని రాహుల్, మాదగాని విక్రం, మనోహర్, కోటిప్రసాద్, మేడి సంపత్, వినయ్, శ్రీకాంత్, గణేష్, ధోని తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లు సేవలను విస్తరించాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి



మాట్లాడుతున్న కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట : లయన్స్ క్లబ్‌లు తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ ద్వారా పేద విద్యార్థులకు సహాయం అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయాలని సూచించారు. అంతేకాకుండా, ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని వాటి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సూర్యాపేట లయన్స్ క్లబ్‌లో సభ్యుల సంఖ్యను పెంచుకోవాలని అన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మిర్యాల సుధాకర్, కార్యదర్శిగా గుండా లక్ష్మయ్య, కోశాధికారిగా పాశం అనంతరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఈగ దయాకర్ గుప్త, యర్రంశెట్టి ఉపేందర్, జాయింట్ సెక్రటరీగా చెరకు కృష్ణగౌడ్, జెడ్‌సీగా కె. లక్ష్మారెడ్డి, ఐ డొనేషన్ కమిటీ సభ్యులుగా వెంపటి శబరినాథ్, మీలా వంశీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, చిలుకూరి రామకృష్ణ, గట్టుపల్లి అశోక్ రెడ్డి, గుడిపూడి వెంకటేశ్వర రావు, కొండపల్లి రేణుక, కొండపల్లి లక్ష్మారెడ్డి, ఉప్పల రాజేంద్రప్రసాద్, రాచర్ల కమలాకర్, బండారు రాజా, పటేల్ నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30వరకు రేషన్ బియ్యం పంపిణీ



తిరుమలగిరి : రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్‌రావు



నూతనకల్‌లో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

తిరుమలగిరి : ఈ నెల 30వ తేదీ వరకు బియ్యం పంపిణీ జరుగుతుందని, కార్డుదారులందరూ బియ్యం తీసుకెళ్లాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వ చౌక ధరల దుకాణదారులు (రేషన్ డీలర్లు) తమ దుకాణాలకు ప్రభుత్వం కేటాయించిన రేషన్ మొత్తాన్ని పూర్తిస్థాయిలో దిగుమతి చేసుకోవాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు నెలలకు సరిపడా సన్న బియ్యాన్ని చౌక ధరల దుకాణాల ద్వారా అందిస్తోందని తెలిపారు. కాబట్టి, రేషన్ దుకాణాలకు కేటాయించిన మొత్తం బియ్యాన్ని డీలర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కాసోజు శంకర్, డీలర్ మారయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని రిజిస్టర్‌లను, నిల్వ ఉన్న సరుకుల వివరాలను పరిశీలించారు. కార్డుదారులందరికీ సక్రమంగా బియ్యాన్ని పంపిణీ చేయాలని, అలాగే రేషన్ దుకాణాన్ని నిర్ణీత సమయాల్లో తెరిచి ఉంచాలని డీలర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ రామరాజు జలేందర్‌రావు, డీలర్ కుంభం మల్లయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై చిన్నచూపు తగదు

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూపిస్తోందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ, రైల్వే నిధుల మంజూరులో కేంద్రం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని ఆమె ఆరోపించారు. ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం రూ. 19,579 కోట్ల విలువైన హైదరాబాద్ మెట్రో 2వ దశ డీపీఆర్‌ను కేంద్రానికి పంపినా, దానిని పట్టించుకోలేదని తెలిపారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాలకు రైల్వే నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంపై కేంద్రం పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను అభివృద్ధి విషయంలో పక్కన పెడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా కేంద్ర పెద్దలను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంపై వివక్ష చూపకుండా నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బీఎస్పీ నూతన కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న లక్ష్మణ్

మద్దిరాల : బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు బుడిగే మల్లేష్ ఆదేశాల మేరకు, పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు చెరుకుపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా బర్పటి మహేష్, మండల అధ్యక్షుడిగా బర్పటి ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా మరికంటి నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా కమిటీ సభ్యులకు చెరుకుపల్లి లక్ష్మణ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఎర్ర రాంబాబు, నియోజకవర్గ కోశాధికారి బర్పటి ఉపేందర్, సుజాత, మహేష్, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

భానుపురి : ప్రజలకు ఆహార భద్రతపై అవగాహన కల్పించడం, సురక్షితమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడంలో భాగంగా, సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న 30 ఆహార వ్యాపార స్థావరాలపై శుక్రవారం అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. యాదాద్రి జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆదేశాల మేరకు సూర్యాపేట ఫుడ్ సేఫ్టీ అధికారి బి. ప్రభాకర్, నల్లగొండ ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్. శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీల్లో భాగంగా హోటళ్లు, టీ స్టాళ్లు, కాఫీ షాపులు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లోని నూనె, కారం, పసుపు, మసాలా, టీ పొడి, పాల నాణ్యతకు సంబంధించి నమూనాలను సేకరించారు. కొన్ని నమూనాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించి సంబంధిత దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఎం. వెంకటపతి, శాంపిల్ అసిస్టెంట్ టి. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలపై విద్యార్థులకు అవగాహన



స్టేషన్‌లో పోలీసుల విధులను విద్యార్థులకు వివరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యాదగిరి

పెన్‌పహాడ్: పోలీసు శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, వారి విధులను తెలుసుకునేందుకు మండల పరిధిలోని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఉపాధ్యాయుడు మామిడి వెంకన్న విద్యార్థులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ యాదగిరి విద్యార్థులతో మాట్లాడారు. పోలీసుల విధులు, ప్రజల సహకారం ఎంత అవసరం అనే విషయాలను వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు తమను తాము ఎలా రక్షించుకోవాలో సూచించారు. ప్రజలకు అందించే సహాయ సహకారాలు, షీ టీమ్స్ విధులు, భరోసా కేంద్రాల ద్వారా ప్రజలకు భరోసా కల్పించడం వంటి అంశాలను తెలియజేశారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఎలా పరిష్కరించుకోవాలో కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రేణుక, శైలజతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న తన్నీరు రాంప్రభు, పాల్గొన్న నాయకులు

తిరుమలగిరి : రజకులు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుమలగిరిలో జరిగిన రజక సంఘం నూతన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రజకులు 10 లక్షల మంది ఉన్నప్పటికీ, రాజకీయంగా కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం తమకు ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ అవసరమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రజకులు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాలలో తగిన ప్రాధాన్యం పొందాలంటే ఐక్యంగా పోరాడాలని సూచించారు. తక్షణమే రాష్ట్రంలో రజక ఫెడరేషన్ చైర్మన్‌తో పాటు పాలక మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాను చాకలి ఐలమ్మ జిల్లాగా మార్చాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు సోమయ్య, గౌరవ అధ్యక్షుడు సత్తయ్య, సోమనర్సయ్య, వెంకన్న, జల్లయ్య, నర్సయ్య, యాకన్న, శేషగిరి, రంగన్న, నరేష్, లక్ష్మయ్య, ముత్తయ్య, అంజయ్య, బ్రహ్మం, సోమనారాయణ, కిరణ్ పాల్గొన్నారు.

సంఘ బంధం నిర్వాహకులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మేనేజర్ భీమయ్య

నూతనకల్ : సమభావన సంఘాల బలోపేతానికి, వాటిని మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి సంఘబంధం నిర్వాహకులు కృషి చేయాలని డీఆర్‌డీఓ మేనేజర్ భీమయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సంఘబంధం నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొదుపు సంఘాల సభ్యులకు పొదుపు, తీసుకున్న అప్పుల చెల్లింపులు వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రుణాలను సకాలంలో చెల్లించేలా సభ్యులను ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వం సమభావన సంఘాల సభ్యులకు అందిస్తున్న వడ్డీ రాయితీ వివరాలను తెలియజేసి, వారు వాటిని పొందే విధంగా చైతన్యవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, డీపీఎం లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఏపీఎం రమణాకర్, పాల్వాయి సరిత, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పాండ్యానాయక్ తండాలో ఇంటింటి సర్వే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు

చివ్వెంల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని మండల లైజన్ అధికారిణి కె. కవిత సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ధర్తి ఆబా జన భాగిదారి అవగాహన, ప్రయోజన వందన శిబిరం' కార్యక్రమంలో భాగంగా ఆమె ఈ విషయాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుంచి జూలై 15 వరకు గిరిజన తండాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అర్హత ఉన్న ప్రతి గిరిజనుడికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 20 పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, హాస్టల్ అధికారుల ద్వారా తెలుసుకోనున్నట్లు వివరించారు. ఈ సర్వేను జిల్లాలోని అనంతగిరి, తుంగతుర్తి, మోతె, చివ్వెంల, పాలకవీడు, మఠంపల్లి మండలాల్లోని గిరిజన గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు తుంగతుర్తి సంత వేలం

తుంగతుర్తి : తుంగతుర్తిలో ప్రతి సోమవారం నిర్వహించే సంతకు శనివారం వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దయానందం శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.1లక్ష డీడీ రూపంలో గానీ, నగదు రూపంలో గానీ డిపాజిట్‌గా చెల్లించాలని సూచించారు. ఈ నెల 28న జీపీ కార్యాలయ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వేలం ఉంటుందని పేర్కొన్నారు.

భూసమస్యలు పరిష్కారం అయ్యేనా..

- భూభారతి సదస్సులలో భారీగా దరఖాస్తులు చేసుకున్న రైతులు
- నాగారం మండలంలో మొత్తం 2376 దరఖాస్తులు
- త్వరలోనే పరిష్కరిస్తామంటున్న రెవెన్యూ అధికారులు



డి.కొత్తపల్లిలో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నాగారం : భూభారతి (నూతన ఆర్వోఆర్) చట్టం అమలులో భాగంగా నాగారం మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి 16వ తేదీ వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ నెల 3వ తేదీ నుంచి 16 వరకు మండలంలోని రెవెన్యూ గ్రామాలైన మామిడిపల్లి, లక్ష్మాపురం, పసునూర్, చెన్నాపురం, ఫణిగిరి, పస్తాల, డి.కొత్తపల్లి, నాగారం, ఈటూరు, వర్ధమానుకోట గ్రామాల్లో సదస్సులు కొనసాగాయి. ఈ సదస్సుల్లో మండల వ్యాప్తంగా 2376 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. గతంలో ధరణిలో పరిష్కారం కాని భూ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తుల అందాయి. ఇక దరఖాస్తుల ఆధారంగా ఫిర్యాదు సమర్పించిన రైతుతోపాటు సమీపంలోని రైతులకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. ఇద్దరి వద్ద ఉన్న డాక్యుమెంట్లతోపాటు ఆధారాలను సమర్పించేందుకు ఏడురోజుల సమయం ఇస్తారు. నిర్దేశిత గడువులోగా సమర్పించిన ఆధారాలు, డాక్యుమెంట్లను పరిశీలిస్తారు. రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులతో పోలుస్తారు. అనంతరం సదరు దరఖాస్తు వాస్తవికతను తేల్చనున్నారు. సాదాబైనామా ద్వారా క్రమబద్ధీకరించే అవకాశం మండలంలో లేదు. మిస్సింగ్ సర్వే నంబర్లు, పెండింగ్ మ్యుటేషన్లు, కోర్టు ఆర్డర్లు, డీఎస్ పెండింగ్, విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు, ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అందజేశారు. అధికారులు రెవెన్యూ గ్రామాలవారీగా వచ్చిన దరఖాస్తులను కేటగిరీలుగా విభజించి కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. సాదాబైనామా అంశం కోర్టు పరిధిలో ఉండడంతో వాటిని మినహాయించి మిగిలిన వాటిని పరిశీలిస్తున్నారు. రెవెన్యూ గ్రామాలవారీగా నోటీసులు జారీ చేసి సమస్యల పరిష్కారానికి యత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలోని సమస్యలను ఆర్డీఓకు సిఫార్సు చేయనున్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం దరఖాస్తులు స్వీకరించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పరిశీలించి పరిష్కరిస్తాం



రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సమస్య ఏ విభాగంలోకి వస్తుందో నిర్ణయించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కరిస్తాం. మండలంలో మొత్తం 2376 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించాం. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అనంతరం పరిష్కారానికి చర్యలు చేపడుతాం.

– హరికిషోర్‌శర్మ, తహసీల్దార్, నాగారం

సంక్షిప్త సమాచారం

వసతి గృహ విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అశోక చక్రవర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మూడ్ మోహన్‌నాయక్, నకిరేకంటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో నగదు చోరీ

సూర్యాపేట టౌన్ : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు నగదు చోరీ చేసిన సంఘటన సూర్యాపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని గోపాలపురంలో నివాసముంటున్న భూక్యా బాలాజీ ఈ నెల 22న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళాన్ని పగులకొట్టి డ్రెస్సింగ్ టేబుల్‌లో దాచిన రూ.2లక్షల నగదు చోరీ చేశారు. ఈ నెల 26న అదే ఇంట్లో అద్దెకు నివాసముంటున్న వ్యక్తి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో ఫోన్ ద్వారా బాలాజీకి సమాచారం అందించాడు. అతను వచ్చి చూడగా డ్రెస్సింగ్ టేబుల్ లో పెట్టిన రూ.2లక్షలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ఈ విషయమై సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక

అర్వపల్లి : రామన్నగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా అక్కెనపల్లి సత్యనారాయణ శుక్రవారం ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను ఎన్నికల అధికారి కాసం భిక్షం పాలసంఘం భవనంలో నిర్వహించారు. డైరెక్టర్లుగా మాగి లక్ష్మి, సీహెచ్. భద్రమ్మ, కారింగుల నర్సయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గొడిశాల యాగానందం, పాలసంఘం డైరెక్టర్లు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కడెం లింగయ్య

తిరుమలగిరి : గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన కడెం లింగయ్య మూడవసారి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

తిరుమలగిరి : రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ వేణుమాధవరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామంలో భూ భారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, సర్వేయర్ అలెన్ జోసఫ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.